పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ధర్మభిక్షం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట టౌన్, మార్చి 26: ఏ విషయంలోనూ రాజీపడని పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ ధర్మభిక్షంగౌడ్ 14వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి జగదీశ్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహనీయుడు ధర్మభిక్షం అని కొనియాడారు. కల్లుగీత కార్మికుల కోసం గీత కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు పెన్షన్లు అందించి వారి హక్కుల సాధనలో తనదైన పాత్రను పోషించారని గుర్తుచేశారు. ధర్మభిక్షం సూర్యాపేట జిల్లాకు గర్వకారణమని అన్నారు. సూర్యాపేట జిల్లాకు ఆయన పేరు పెట్టే విషయంలో తనవంతు సహకారం తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దంతాల రాంబాబు, అనంతుల మల్లీశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు, మారిపెద్ది శ్రీనివాస్, బత్తుల ప్రసాద్, ఎల్గూరి రాంబాబు, దేవత్ కిషన్, దేశగాని శ్రీనివాస్, మీనయ్య పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల: బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా వద్ద ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, కొప్పు లక్ష్మీనారాయణ, చామకూరి వీరయ్య, కొమ్మరాజు వెంకట్, దోరేపల్లి వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాస్, మొగరాలు ఉదయ్, శేఖర్, శ్రీనివాస్, జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో..

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని గీత పనివారల భవనంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్గూరి గోవింద్, గునగంటి కృష్ణ, కెక్కిరేణి సత్యనారాయణ, ఎల్గూరి లక్ష్మమ్మ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కెక్కిరేణి నాగయ్య, పల్స వెంకన్న, బైరు వెంకన్నగౌడ్, శ్రీను, రాపర్తి దుర్గయ్య, రాపర్తి రాము, రాపర్తి రవి, రాపర్తి సైదులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మార్చి 26: కొత్తగా పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఐపీసీ, టీఎస్ ఐపాస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 26 వరకు జిల్లాలో 14 పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని, సుమారు రూ.109.30 కోట్ల పెట్టుబడులతో స్థాపించడానికి వివిధ శాఖల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 500 మందికి ఉపాధి కల్పించడానికి ఆస్కారం ఉందన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు డీట్ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను డీట్ యాప్‌లో పొందుపర్చాలని కోరారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, జడ్పీ సీఈఓ అప్పారావు, సీటీఓ యాదగిరి, ఎల్‌డీఎం బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలి

ఏప్రిల్ 1న రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపుల్లో మామిడి తోరణాలు, పూల దండలు కట్టాలని అన్నారు. జిల్లాలోని 610 రేషన్ దుకాణాల్లో ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు సన్న బియ్యం పంపిణీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్ఓ రాజేశ్వర్ రెడ్డి, డీఎం ప్రసాద్, సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవరావు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో 30న జరిగే సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మార్చి 26: మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహ హెచ్చరించారు. వేధింపులకు, దాడులకు గురైన మహిళలకు ధైర్యం కల్పించేందుకు షీ టీమ్స్ భరోసా సెంటర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహిళా భరోసా సెంటర్, షీ టీమ్స్ కార్యాలయాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. మహిళలు, పిల్లల రక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలపై తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులకు, వేధింపులకు గురవుతున్న బాలికలు, మహిళల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు న్యాయ సహాయం అందించాలని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో ఆకతాయిలపై నిఘా ఉంచాలని, విద్యాసంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేసి ఎలాంటి సమస్య వచ్చినా, వేధింపులు జరిగినా సమాచారం వచ్చేలా నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, షీటీమ్ ఎస్ఐ నీలిమ, ఏఎస్ఐలు సైదాబీ, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

తిరుమలగిరి, మార్చి 26: తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత సైబర్ మోసగాళ్ల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నికోలస్, హెచ్ఎం సంజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం’

నిరసన తెలుపుతున్న బీఈడీ అభ్యర్థులు

కోదాడ టౌన్, మార్చి 26: ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని బీఈడీ అభ్యర్థుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతుల ప్రక్రియకు వ్యతిరేకంగా కోదాడలోని బాపూజీ శాఖ గ్రంథాలయం ఎదుట బుధవారం బీఈడీ అభ్యర్థులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాల్లో 30 శాతం మాత్రమే నేరుగా భర్తీ చేస్తూ 70 శాతం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. బీఈడీ అభ్యర్థులు రాంబాబు, శ్రీను, సందీప్, నరేశ్, శోభ, సారిక, సుమ, తులసి, రమేశ్, శ్రీరాములు, శ్రీకాంత్, రామారావు, ఉపేందర్ పాల్గొన్నారు.

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

పెన్‌పహాడ్, మార్చి 26: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2024–25 సంవత్సరానికి గానూ మండలానికి చెందిన మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి అనిల్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతితో లేదా బ్యాటరీతో నడిచే మందు పంపులు 8 (జనరల్ 7, ఎస్సీ 1), పవర్ తైవాన్ స్ప్రేయర్లు 8 (జనరల్ 6, ఎస్సీ 1, ఎస్టీ 1), రొటోవేటర్లు 3 (జనరల్ 2, ఎస్టీ 1), సీట్ ఫెర్టిలైజర్ డ్రిల్ (జనరల్ 1), ట్రాక్టర్‌తో దున్నే పనిముట్లు 4 (జనరల్ 3, ఎస్సీ 1) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 50 శాతం సబ్సిడీతో పనిముట్లు పొందడానికి మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మహిళా రైతు కొత్త పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలు, ట్రాక్టర్ పనిముట్లు అయితే మహిళ పేరుతో ఉన్న ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, దరఖాస్తు ఫారం, రైతు చెల్లించాల్సిన వాటాకి సంబంధించిన డీడీతో సంప్రదించాలని, ముందు దరఖాస్తు చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి

చివ్వెంల, మార్చి 26: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన తుల్జారావుపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు సీతారాం(75) గ్రామ శివారులోని చెరువు వద్ద గేదెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో గేదెలు చెరువులోకి దిగగా వాటిని మళ్లించేందుకు వెళ్లి జారి చెరువులోని నీటి గుంటలో పడ్డాడు. సీతారాం కనిపించక పోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. చివరికి చెరువులో శవమై కనిపించాడు. సీతారాం కుమారుడు రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

ఆటో, ట్రాక్టర్ ఢీకొని మహిళా కూలీకి తీవ్రగాయాలు

మఠంపల్లి, మార్చి 26: ఆటో, ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళా కూలీకి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దైదా మానస ఆటోలో ఇతర కూలీలతో కలిసి కిష్టాపురం గ్రామంలో మిరప తోటలో పనులకు బయలుదేరారు. రఘునాథపాలెం మెయిన్ రోడ్డుపై వెళ్తున్న క్రమంలో నాయుడు గురవయ్య అనే వ్యక్తి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి ఆటోను ఢీకొట్టడంతో మానస కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మానసను చికిత్స నిమిత్తం తొలుత హుజూర్‌నగర్, అక్కడి నుండి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మానస మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బాబు తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట కోదాడ – మిర్యాలగూడ ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. అప్పన్నపేటకు చెందిన గుర్రం పిచ్చిరెడ్డి గరిడేపల్లి నుంచి అప్పన్నపేట వైపు వెళ్తుండగా ముందున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని పిచ్చిరెడ్డి కిందపడగా ముఖానికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు.

‘పది’ పరీక్షలో మాస్ కాపీయింగ్ కలకలం

చివ్వెంల, మార్చి 26: మండల పరిధిలోని జి.తిర్మలగిరి పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగిందనే ప్రచారం కలకలం రేపింది. పరీక్ష కేంద్రం వద్ద చిట్టీలు కనిపించడం అనుమానాలకు తావిచ్చింది. బుధవారం గణిత శాస్త్రం పరీక్ష నిర్వహించగా వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు చిట్టీలు అందించేందుకు తీసుకొచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని పరీక్ష కేంద్రం ఉండడంతో ఉపాధ్యాయులు కారులో వచ్చి చిట్టీలు అందిస్తున్నట్లు సమాచారం. బాధ్యతగా ఉండాల్సిన ఉపాధ్యాయులే ఇటువంటి చర్యలకు పాల్పడడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పరీక్ష కేంద్రం నిర్వాహకులు అమృతారెడ్డిని వివరణ కోరగా పోలీసు బందోబస్తు నడుమ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నడిగూడెం, మార్చి 26: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడేనికి చెందిన దేవరంగుల ఎల్లయ్య (39) కూలి పనులు చేస్తూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మానసిక సమస్యలతో బాధపడుతున్న ఎల్లయ్య.. బుధవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి బాలుడు మృతి

నూతనకల్, మార్చి 26: బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాల పాలై బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని మిర్యాల గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బొప్పాని సురేశ్, అతని బావమరిది కళ్లేపల్లి పవన్, రిషి (10) అనే బాలుడు కలిసి బైక్‌పై చిననెమిల క్రాస్‌రోడ్డు వైపు వెళ్తుండగా మిర్యాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. రిషి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. రిషి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బైక్ నడిపిన పవన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లింగమంతుల స్వామి ఆలయంలో చోరీ

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 26: మండల పరిధిలోని అమరవరం గట్టు లింగమంతుల స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పూజారి లింగయ్య స్వామి గుడిలో పూజలు నిర్వహించేందుకు వెళ్లి తలుపు తెరిచి చూడగా హుండీ తలుపు తెరిచి ఉండడం కనిపించింది. హుండీలోని సుమారు రూ.5 వేల నగదు చోరీకి గురైంది. లోపలికి వెళ్లి చూడగా రూ.15 వేల విలువైన 30 ఇత్తడి గంటలు కనిపించకపోవడంతో ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల కృష్ణకు విషయం తెలియజేయడంతో పోలీసులకు సమాచారం అందించారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

లింగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నూతనకల్, మార్చి 26: మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు చూడి లింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన రైతుబంధు సమితి మాజీ కో ఆర్డినేటర్ గుండు లింగయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య, మాజీ జడ్పీటీసీ నర్సింగ్‌నాయక్, నాయకులు బత్తుల సాయిలు, గాజుల తిరుమలరావు, బత్తుల విద్యాసాగర్, బిక్కి బుచ్చయ్య, బత్తుల విజయ్, ఎం.వెంకన్న, మల్లికార్జున్, ఉప్పుల వీరుయాదవ్, రేసు వెంకటేశ్వర్లు, కనకటి మహేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడ రూరల్, మార్చి 26: పట్టణ పరిధిలోని కోమరబండ ఇండస్ట్రియల్ ఫీడర్, దోరకుంట విలేజ్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టనున్నందున గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల: మండలంలోని ముకుందాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ మరమ్మతు పనులు చేపడుతున్నందున అన్ని ఫీడర్ల పరిధిలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పందిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి : ఏఐకేఎంఎస్

ఆత్మకూర్.ఎస్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూర్.ఎస్, మార్చి 26: ఎండిన వరి పంటలకు ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎస్సారెస్పీ నీటిని ఏప్రిల్ నెల మొత్తం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ నాయకులు డేగల వెంకటకృష్ణ, కొండేటి సంజీవరెడ్డి, దాసరి శ్రీను, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, సీతారాం రెడ్డి, లాలు, రాములు, బుజ్జి పాల్గొన్నారు.

నాగారం: ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలని తాసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జాజుల సామేల్, లింగయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి: ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలనే డిమాండ్‌తో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ ఆధ్వర్యంలో తాసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. పోలబోయిన కిరణ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకుడు లింగయ్య, కార్యదర్శి బయ్యన్న, సోమయ్య, కొమరయ్య, నర్సయ్య, సురేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, మార్చి 26: యాసంగి వరికోతలు ప్రారంభమైనందున తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుంగతుర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం అమ్ముకుంటున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, మండల నాయకులు తునికి సాయిలుగౌడ్, గోపగాని రమేశ్, ఉప్పుల నాగమల్లు, కొండగడుపుల వెంకటేశ్, బొజ్జ సాయికిరణ్, గోపగాని వెంకన్న, వెంకటేశ్, అఖిల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాజేశ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 26: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి స్నేహితులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని వేపలసింగారం గ్రామానికి చెందిన ఉల్లెందుల రాజేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా కోదాడ ఎస్వీ డిగ్రీ కళాశాల 2009–12 బ్యాచ్ విద్యార్థులు బుధవారం రూ.35 వేలు నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో తమవంతు సహకారం అందించినట్లు తెలిపారు.

శ్రీనివాస్ కుటుంబానికి సాయం అందజేస్తున్న నాయకులు

నాగారం: మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన మర్రిపల్లి శ్రీనివాస్ కుటుంబానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రూ.32,500 ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఉపాధి హామీ మేట్లు రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏశబోయిన లింగయ్య, చుంచు జానమ్మ, నాతి మంజుల, పెరమాండ్ల రవి, నాతి ఉప్పలయ్య, ఏర్పుల రేణుక, సూర లింగయ్య, శ్రీను, మంజుల, సైదులు, యమున, పుష్ప, వీరకుమార్, స్వామిబాబు, కృష్ణ, కేతమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

నడిగూడెం, మార్చి 26: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం నడిగూడెంలో నిర్వహించిన ఆ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని అన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కొరట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ రూరల్, మార్చి 26: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ సూచించారు. బుధవారం కోదాడలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని ఆటో డ్రైవర్ల అడ్డా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని, యూటర్న్‌ల వద్ద జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖయ్యూం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను కాపాడాలి : డీపీఓ

వన నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

అర్వపల్లి, మార్చి 26: మండల పరిధి రామన్నగూడెం గ్రామంలోని వన నర్సరీని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం ఆరంభం నాటికి మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. మొక్కలను ఎండిపోకుండా కాపాడాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గోపి, కార్యదర్శులు కృష్ణవేణి, సుధాకర్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

రాయినిగూడెం గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గరిడేపల్లి, మార్చి 23: మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో భాగంగా బుధవారం గ్రామంలోని వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలు పూడిక తీయడం, బ్లీచింగ్ చల్లడం, కంపచెట్లు తొలగింపు తదితర సేవా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.నాగార్జున, ఎస్.బాలరాజు, నగేశ్, బి.సైదానాయక్ పాల్గొన్నారు.

‘భవన నిర్మాణం పూర్తి చేయాలి’

సూర్యాపేట అర్బన్, మార్చి 26: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో రిటైర్డ్ ఉద్యోగుల కోసం నిర్మించ తలపెట్టిన సంఘం భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు సుంకరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తన సొంత నిధులు రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లి నర్సయ్య, శంకరయ్య, చిన్న సైదులు, పాషా, బత్తుల దశరథ, కృపాకర్‌రెడ్డి, ఖదీర్, వీరయ్య, నర్సయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

‘కళాకారులకు ఉద్యోగాలివ్వాలి’

సూర్యాపేట టౌన్, మార్చి 26: తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రస్తుతం నిరుద్యోగులుగా ఉన్న కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర జేఏసీ సభ్యుడు నకిరేకంటి చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటి వరకు ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. లింగయ్య, శైలేందర్, ఉపేందర్, వినయ్, సువర్ణ, వెంకటేశ్, శ్రీను పాల్గొన్నారు.

‘రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి’

గరిడేపల్లి, మార్చి 26: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించే దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ కోరారు. బుధవారం నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘంలో సబ్సిడీ రుణాలను పొంది రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో సీఈఓ విడికొండ కనకయ్య, సంఘం డైరెక్టర్లు చనగాని సాంబయ్య, బాల్దూరి అంజయ్య, సిబ్బంది దొంగరి శ్రీనివాస్, పాలెల్లి అంజయ్య, నకిరేకంటి సాయిలు, హరీశ్, రైతులు ముత్తినేని సోమయ్య, వీరయ్య, కొత్త వెంకటేశ్వర్లు, రామినేని సైదులు, షేక్ చాంద్‌మియా, సైదా హుస్సేన్, అంజయ్య, రవి, కోటేశ్వరరావు, కోటయ్య పాల్గొన్నారు.

‘నీటిని పొదుపుగా వాడాలి’

తిరుమలగిరి, మార్చి 26: నీటిని పొదుపుగా వాడుకుంటూ భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో మండల పరిధిలోని తొండ గ్రామంలో బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ పాలకుర్తి శ్రీకాంత్, కళా బృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, మెడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పాస్‌పోర్ట్ And OCI Card పోయినది

★ S ప్రభాకర్ రెడ్డి S/o. బాల్ రెడ్డి, R/o. H.no.4-11-202/1, చైతన్యపురి కాలనీ, G.V.గూడెం, నల్లగొండ, Town & Dist, అను నాయొక్క మనుమరాలు అయిన యానాల ఇషికారెడ్డి D/o. యానాల సందీప్ రెడ్డి కి చెందిన Passport No. AO4161857, United Sates Department of State and OCI card No A4104585 (File Reference No. USAH08B28N21) ఒరిజినల్ చైతన్యపురికాలనీ నుండి భాస్కరటాకీస్ రోడ్, నల్లగొండ ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి. దొరికిన వారు సంప్ర|| 9440204111
NLG

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638